క్లుప్తంగా

ఈతచెట్లు తొలగింపుపై ఫిర్యాదు

ఊట్కూరు: మండలంలోని కొత్తపల్లి శివారులో గల ప్రభుత్వ భూమిలో ఈత చెట్లను తొలగించడంపై సోమవారం తహసీల్దార్ తిరుపతికి బిజ్వార్ చెందిన గీత కార్మికులు ఫిర్యాదు చేశారు. సుమారు 150 ఎకరాలు ఈత వనం ఉందని తెలిపారు. దీనిపై ఆధారపడి ఆదారపడి గీత కార్మికులు, ఎరుకల కులస్తులు జీవనం పొందుతున్నారని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రామలింగంగౌడ్, వెంకటేష్‌గౌడ్, బాలరాజుగౌడ్, ఎల్లగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానశాస్త్ర అభివృద్ధితోనే మానవ మనుగడ

కోస్గి: ప్రస్తుత సమాజంలో విజ్ఞాన శాస్త్ర అభివృద్ధితోనే మానవ మనుగడ సాగుతుందని, నిరంతర పరిశోధనలు, స్వతంత్ర ఆలోచనలతోనే విజ్ఞానశాస్త్రం మరింత అభివృద్ధి చెందుతుందని గుండుమాల్ క్లస్టర్ హెచ్ఎం వెంకట్రాముడు అన్నారు. సోమవారం పాఠశాలలో 28న జాతీయ సైన్స్ దినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు పలు సైన్స్ పోటీలు నిర్వహించారు. సైన్స్‌కు సంబంధించిన అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేస్తామని హెచ్ఎం సత్యనారాయణ తెలిపారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులకు అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

క్రీడాకారిణికి ఆర్థికసాయం

ఊట్కూర్: మండల కేంద్రానికి షూటింగ్ బాల్ జాతీయ స్థాయి క్రీడాకారిణి సునీతకు సోమవారం రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గోపాలం, జిల్లా అధ్యక్షుడు తాన్‌సింగ్‌రాజ్ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. ఆమె తండ్రి ఇటీవల మృతి చెందగా, చదువుకు ఆటంకం కారాదని సాయం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రభుత్వ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో శిక్షణ పొందుతుందని శిక్షణ పూర్తయ్యేవరకు ఆర్థికసాయం అందిస్తామని తెలిపారు.

ఎస్సీ హాస్టల్ ఆకస్మిక తనిఖీ



ధన్వాడ: విద్యార్థులు పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని డీఎస్‌డీఓ కన్య కుమారి అన్నారు. సోమవారం రాత్రి మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులకు వండుతున్న భోజనం పరిశీలించారు. విద్యార్థులను పలు వివరాలు అడిగి తెలుసుకుని, పరిసరాలను పరిశీలించారు.

ఉన్నత విద్యకు ఓపెన్ వర్సిటీ ప్రాముఖ్యత

రాయచూరు రూరల్: కల్యాణ కర్ణాటకలో ఓపెన్ విశ్వవిద్యాలయం(మానస గంగోత్రి) నుంచి ఉన్నత విద్యకు ప్రాముఖ్యత ఇవ్వనున్నట్లు వైస్ చాన్స్‌లర్ శరణప్ప వైద్యనాథ్ హలస పేర్కొన్నారు. ఆయన సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించడానికి వర్సిటీలో తక్కువ ఫీజులతో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ డిప్లొమా కోర్సుల అభ్యాసానికి అవకాశం కల్పించామన్నారు. దక్షిణ కర్ణాటకతో పోల్చుకుంటే ఈ ప్రాంత అభివృద్ధికి వర్సిటీ తరఫున తమ వంతు కృషి చేస్తామన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భూమిలో అధ్యాయన కేంద్రం ప్రారంభిస్తామన్నారు.

రేణుకాచార్య విగ్రహ ఏర్పాటుకు డిమాండ్

రాయచూరు రూరల్: నగర శివార్లలోని రేణుకాచార్య సర్కిల్ వద్ద జగద్గురు రేణుకాచార్యుల విగ్రహం ఏర్పాటు చేయాలని కిల్లే బృహన్మఠాధిపతి శాంతమల్ల శివాచార్య ప్రస్తావించారు. సోమవారం ఎంపీ కార్యాలయంలో లోక్‌సభ సభ్యుడు రాజా అమరేశ్వర నాయక్‌తో సుదీర్ఘంగా చర్చించారు. నగర ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్‌తోనూ మాట్లాడామన్నారు. మార్చిలో నిర్వహించే జయంతి నాటికి విగ్రహ స్థాపనకు ఎమ్మెల్యే రూ.25 లక్షలు మంజూరు చేశారని తెలిపారు.

సమాజోద్ధారకుడు సర్వజ్ఞ

రాయచూరు రూరల్: నగరంలో కవి సర్వజ్ఞ జయంతిని సోమవారం ఆచరించారు. బసవేశ్వర సర్కిల్ వద్ద కవి సర్వజ్ఞ చిత్రపటానికి సమాజం అధ్యక్షుడు సురేంద్రబాబు పూలమాల వేసి పూజ చేశారు. అనంతరం కన్నడ భవనంలో జిల్లా అధికార యంత్రాంగం, జిల్లా పంచాయతీ, నగర సభ, కన్నడ సంస్కృతి శాఖల ఆధ్వర్యంలో త్రిపది సర్వజ్ఞ జయంతిని ప్రారంభించారు. అనంతరం సురేంద్రబాబు మాట్లాడుతూ సమాజంలో అట్టడుగున ఉన్న కుమ్మర సమాజం ఆర్థికంగా, సాంఘీకంగా, విద్యాపరంగా అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో నగరసభ అధ్యక్షురాలు లలిత, కమిషనర్ గురులింగప్ప, తహసీల్దార్ చెన్నమల్లప్ప, అధికారిణి మంగళ నాయక్ ఉన్నారు.

తప్పని కాలినడక



కొల్లూర్ స్టేజికి కాలినడకన వస్తున్న విద్యార్థులు

- కానరాని పల్లెవెలుగు బస్సులు
- ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు
- ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న విద్యార్థులు, ప్రజలు



పెద్దపొర్లకు వేసిన బీటీ రోడ్డు

ఊట్కూర్: ప్రభుత్వం పల్లెపల్లెకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించిన ఆర్టీసీ అధికారులు మాత్రం బస్సులు నడపడం లేదు. విద్యార్థులు ఉన్నత చదువులకై పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లేందుకు కాలినడక తప్పడం లేదు. ప్రతి పల్లెకు పల్లెవెలుగు బస్సును నడిపిస్తామని ఆర్టీసీ అధికారులు ప్రచారం చేస్తున్నా, అమలుపరచడంలో విఫలమవుతున్నారు. మండలంలో సమస్తాపూర్, పెద్దపోర్ల, మల్లెపల్లి, లక్ష్మీపల్లి, ఓబ్లాపూర్ గ్రామాలకు ఇటీవల ప్రభుత్వం బీటీ రోడ్డు సౌకర్యం కల్పించింది. కానీ బస్సులు తిరగడం లేదు. ఆయా గ్రామాలకు చెందిన విద్యార్థులు నారాయణపేట, మక్తల్ కళాశాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పెద్దపొర్ల నుంచి స్టేజి వరకు 4 కి.మీ. బీటీ రోడ్డు ఉంది. గ్రామం నుంచి సుమారు 80 మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు నారాయణపేట, మక్తల్ వెళ్తుంటారు. చిన్నపొర్ల నుంచి స్టేజి వరకు 4 కి.మీ. బీటీ రోడ్డు ఉంది. గతంలో ఉదయం, సాయంత్రం వేళలో బస్సులు నడిచేవి. రోడ్డు మరమ్మతు చేపట్టలేదని రెండేళ్లుగా బస్సును నిలిపివేశారు. దీంతో విద్యార్థులు, ప్రైవేట్ వాహనాలు, కాలినడకన వెళ్తున్నారు. వారం రోజులుగా బీటీ రోడ్డు మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. ఆర్టీసీ అధికారులు స్పందించి ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఆయాగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బస్సుల కొరత ఉంది..

నారాయణపేట డిపోలో బస్సుల కొరత ఉంది. ఇప్పటికే గ్రామస్తులు వినతిపత్రాలు ఇచ్చారు. కొత్తబస్సులు మంజూరుకై ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. కొత్త బస్సులు వచ్చిన వెంటనే ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పిస్తాం.

– ఆంజినేయులు, డిపో మేనేజర్, నారాయణపేట

8కి.మీ. నడుస్తున్నా..



మక్తల్‌లోని కళాశాలలో ఇంటర్ చదువుతున్నాను. గ్రామానికి బస్సు సౌకర్యం లేదు. గ్రామం నుంచి స్టేజికి 4కి.మీ. దూరం ఉంది. గ్రామం నుంచి రోజు 60 మంది విద్యార్థులు కాలినడకన కళాశాలలకు వెళ్తుంటారు. రోజు స్నేహితులతో కలిసి స్టేజి వరకు కాలినడకన వెళ్తున్నా.

– చెన్నమ్మ, విద్యార్థి, పెద్దపొర్ల

బస్సు సౌకర్యం కల్పించాలి



పెద్దపొర్ల, చిన్నపొర్ల, కొల్లూర్ విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు జిల్లా కేంద్రం నిత్యం వెళ్తుంటారు. గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు రోజు 3, 4 కి.మీ నడుచుకుంటూ స్టేజి వరకు వెళ్తున్నారు. వారం రోజుల క్రితం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించాం. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలి.

– అజయ్, జిల్లా కార్యదర్శి, పీడీఎస్‌యూ

సర్పంచ్‌పై వార్డు సభ్యుల తిరుగుబాటు

- పైపులైన్ లీకేజీల పేరుతో రూ.లక్షలు స్వాహా
- రెండేళ్లుగా పంచాయతీకి రాని సర్పంచ్
- సర్పంచ్ తీరు నచ్చక ఉప సర్పంచ్, వార్డు సభ్యులు రాజీనామా



ఎంపీఓకి రాజీనామా పత్రాలు ఇస్తున్న ఉపసర్పంచ్, వార్డు సభ్యులు

మరికల్: సర్పంచ్ అవినీతి అక్రమాలపై ఉపసర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులు సోమవారం మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తూ ఎంపీఓ బాలాజీకి వినతిపత్రం ఇచ్చారు. ఉపసర్పంచ్ శివకుమార్, వార్డు సభ్యులు రామకృష్ణారెడ్డి, నాగరాజు, రాము, విజయ్ మాట్లాడుతూ మరికల్ సర్పంచ్‌గా ఎన్నికైన కస్పె గోవర్ధన్ రెండేళ్ల నుంచి పంచాయతీ కార్యాలయానికి రాకుండా తన ఇంటి వద్దే కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారని అన్నారు. గ్రామంలోని పలు వార్డుల్లో రహదారులు మరమ్మతు, వీధి దీపాలు, మిషన్ భగీరథ లీకేజీలు, ఎక్కడి చెత్త అక్కడే పడి ఉన్న విషయాన్ని పలుమార్లు గ్రామసభల్లో సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదన్నారు. కాలనీలకు చెత్తబండి రాక 25 రోజులు అవుతుందని, ఎక్కడిక్కడ చెత్త పేరుకుపోయిందన్నారు. చెత్త బండి తిరగకున్నా డీజిల్ బిల్లులను మాత్రం తీసుకోవడమే కాకుండా, గ్రామంలో పైపులైన్ వాటర్ లీకేజీల మరమ్మతు చేయకున్నా ఎంబీ రికార్డు చేసి కార్యదర్శి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు తెలియకుండా రూ. 3.40 లక్షల బిల్లును కాజేశారని ఆరోపించారు. గ్రామంలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులు విజృంభిస్తున్నా పారిశుద్ధ్య పనులు చేపట్టడంలో విఫలమయ్యారని అన్నారు. తన సొంత పనులకు పంచాయతీ సిబ్బందిని వాడుకుంటూ వేధిస్తున్నారని అన్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న సర్పంచ్ పనితీరు నచ్చకపోవడం వల్లే రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో మల్లేష్, కమల్, మొగులప్ప, నాగరాజు ఉన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి



మాగనూరులో మాట్లాడుతున్న శేర్‌కృష్ణారెడ్డి

మక్తల్: ఉపాధ్యాయుల సంక్షేమానికి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం కృషి చేస్తుందని జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో బాలుర, బాలికల, కస్తూర్బా పాఠశాలల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

మాగనూర్: ఉపాధ్యాయుల సంక్షేమమే ఏవీఎన్‌రెడ్డి లక్ష్యమని తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఏవీఎన్‌రెడ్డిని తపస్ బలపరచిందని తెలిపారు. మండల పరిధిలోని నేరగడం ఉన్నత పాఠశాలలో వారు మాట్లాడారు. 15ఏళ్ల పాటు ప్రభుత్వ లెక్చరర్‌గా సేవలు అందించి విద్యారంగంపై సుదీర్ఘమైన అనుభవం కలిగిన ఈయనను గెలిపించడం వల్ల ప్రభుత్వ ఉపాధ్యాయ సమస్యలపై దృష్టి సారిస్తామని అన్నారు.

ధన్వాడ: పీఆర్‌టీయూ అధికారిక ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవ రెడ్డిని గెలిపించాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రెడ్డి, జానార్దన్‌రెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలోని పలు పాఠశాల, కళాశాలల్లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ప్రచారం నిర్వహించారు.

'రామనామానికి మించిన స్మరణ లేదు'



సీతారాముల విగ్రహాలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి దంపతులు

నారాయణపేట రూరల్: నిత్యం రామనామస్మరణ చేస్తే జీవితంలో అన్ని రకాల బాధలు తొలిగిపోతాయని ఆధ్యాత్మిక వేత్త, హనుమత్ ఉపాసకులు శ్రీనివాస్‌రావు అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి నేతృత్వంలో ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న సుందరకాండ పారాయణం సోమవారం ప్రారంభమైంది. ఆయన మాట్లాడుతూ.. రామాయణంలోని ఏడు కాండాల్లో సుందరకాండ ఒక భాగమని, మనిషి జీవితంలో పుట్టుక, మరణం, మంచి, చెడు, సృష్టి, పంచ భూతాలను దీనిలో మిళితమై ఉన్నాయన్నారు. రామనామానికి మించిన స్మరణ మరొకటి లేదని, ప్రతి రోజు రాముడిని స్మరించాలన్నారు. అంతకుముందు గోపూజ, షమీ వృక్షానికి పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సురేఖ, ఎస్పీ వెంకటేశ్వర్లు, డీఎస్పీ సత్యనారాయణ, ఆర్డీఓ రాంచందర్, జెడ్పీ సీఈఓ జ్యోతి, మున్సిపల్ కమిషనర్ సునీత, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు, పట్టణ ప్రజలు

కలెక్టరేట్‌లో ప్రజావాణి



నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ శ్రీహర్ష ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలను విన్నవించగా, పరిశీలించి అధికారులకు పరిష్కారానికి ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మయాంక్‌మిత్తల్, నాగేందర్‌ప్రసాద్, నార్సింగ్‌రావు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేసుకోండి

మాగనూర్: ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని కోత్తపల్లి సర్పంచ్ తిమ్మప్ప అన్నారు. సోమవారం ఆయన మండల వైద్యాధికారి రాఘవేంద్రరెడ్డితో కలిసి పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పరీక్షలకు వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శిరీష, సూపర్‌వైజర్ యాదమ్మ, కార్యదర్శి కిశోర్ పాల్గొన్నారు.

బిజ్వార్‌లో ప్రారంభం

ఊట్కూరు: మండలంలోని బిజ్వార్‌లో సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ సావిత్రమ్మ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ 18ఏళ్ల పైబడిన వారందరికీ కంటి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, కంటి అద్దాలు, కంటిలో శుక్లాలు ఉన్నవారికి ఆపరేషన్‌లకై ఆస్పత్రులకు సిఫార్సు చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో శ్రీశైలం, శ్రీలత, ఉపసర్పంచ్ నరసింహులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

టీచర్లపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

నారాయణపేట రూరల్: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ జెడ్పీ స్కూల్‌లో పనిచేస్తున్న పండిట్‌ల సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు కాశన్న, మోహన్‌నాయక్ సోమవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, రాష్ట్ర వ్యాప్తంగా పండిట్‌లు ఉన్నత పాఠశాలల్లో 9, 10వ తరగతుల బోధన చేయకుండా సహాయ నిరాకరణ చేస్తున్నారని, అందులో భాగంగానే నారాయణఖేడ్‌లో చేశారని తెలిపారు. అక్కడి డీఈఓ నాంపల్లి రాజేష్ అత్యుత్సాహంతో టీచర్లను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు ఇవ్వడం సరికాదని, వెంటనే వెనక్కి తీసుకుని విధుల్లోకి పంపాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



నారాయణపేట రూరల్: మండలంలోని జాజాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులై తరగతి గదిలో పాఠ్యాంశాలను బోధించారు. డీఈఓగా నందిని, ఎంఈఓగా మనీష, హెచ్ఎంగా సంధ్యారాణి వ్యవహరించగా 33మంది విద్యార్థులు టీచర్లుగా విధులు నిర్వర్తించారు. చిన్నారుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు హాజరై ఉపాధ్యాయ పాత్ర పోషించిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందిచారు. కార్యక్రమంలో సర్పంచ్ సుగంధమ్మ, ఎంపీటీసీ ప్రభాకర్, ఎస్ఎంసీ చైర్మన్ బాలరాజు, జిల్లా పరీక్షల విభాగం అధికారి రాజేంద్రకుమార్, డీఎస్ఓ భానుప్రకాష్, కనకప్ప తదితరులు పాల్గొన్నారు.

మరికల్: మండల కేంద్రంలోని ఎంపీపీఎస్‌లో విద్యార్థులు సోమవారం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. చక్కగా బోధన చేసిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

బీఆర్‌ఎస్ నాయకులను నిలదీయాలి



మాట్లాడుతున్న మల్లయ్య

ధన్వాడ: గ్రామాలలో అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్ ఏం చేసిందో ప్రతి గ్రామస్తుడు నిలదీయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య అన్నారు. మండలంలోని మంత్రోనిపల్లిలో సోమవారం సాయంత్రం ప్రజాగోస బీజేపీ భరోస సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో ఇప్పటి వరకు ఒక్కరికి కూడా డబుల్ బెడ్రూం ఇళ్ల మంజూరు చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాల గురించి వివరించారు. గోవర్ధన్‌గౌడ్, ఉదయబాను, శ్రీనివాస్, శివరాజు, రాఘవేందర్‌గౌడ్, నరేష్, రవికుమార్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

మాగనూర్: మండలంలోని నేరడగం సమీపంలోని మక్తల్‌కు వెళ్లే ప్రధాన బీటీ రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారిందని గ్రామస్తులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్కువ ఎత్తులో రక్షణ గోడ నిర్మించడం, ప్రమాదకరంగా వైర్లు రోడ్డు సమీపంలో ఉన్నాయని అంటున్నారు. ప్రధాన రహదారి వెంట పశువులు వెళ్లేటప్పుడు విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశం ఉంది. వాహనాలు ఏమాత్రం అదుపు తప్పినా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొంటాయి. ప్రమాదాలు కాకముందే ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను మరో చోటుకు మార్చాలని కోరుతున్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్, నాయకులు

దామరగిద్ద: మండల కేంద్రం, లోకూర్తిలో సోమవారం సీసీ రోడ్డు పనులను ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఆశమ్మ, మహేశ్వరి, ఎంపీపీ నర్సప్ప, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు భీమయ్యగౌడ్, విండో అధ్యక్షుడు ఈదప్ప ప్రారంభించారు. వారు మాట్లాడుతూ..మంజూరు చేసిన రోడ్డు నిర్మాణంతో ఎంతో సౌకర్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో బసంత్‌రెడ్డి, సదర్శన్, రాచప్ప, చంద్రకాంత్, బస్వంత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు తగవు



విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఊట్కూర్: చిన్నపోర్లలో శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపన విషయంలో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిపై బీజేపీ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని ఎంపీటీసీ సభ్యుడు రవిప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 226లో రైతువేదిక భవనం ఏర్పాటు చేశారన్నారు. రైతు భవనం పరిసరాల్లో పార్టీల జెండాలు, దేశ నాయకులు విగ్రహాలను ఏర్పాటు చేయాలంటే కలెక్టర్ అనుమతులు తీసుకోవాలని గతేడాది ఆగస్టులో తహసీల్దార్ కార్యదర్శి, సర్పంచ్‌కు నోటీసులు అందించారని తెలిపారు. కలెక్టర్ ఇచ్చిన నోటీసులను పక్కన పెట్టి సర్పంచ్ ఏకపక్ష నిర్ణయాల వల్ల గ్రామంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేసినా అర్ధరాత్రి విగ్రహ ప్రతిష్ఠాపన పనులను పూర్తిచేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తాము విగ్రహాల ఏర్పాటుకు వ్యతిరేకులం కాదని, గ్రామంలో దేశనాయకుల విగ్రహాలు ప్రతిష్ఠించే విషయంలో అఖిల పక్ష నాయకులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో స్థలాన్ని నిర్ణయిస్తే బాగుంటుందని అన్నారు. గ్రామాభివృద్ధికి సర్పంచ్ పాటుపడడం లేదని ఆరోపించారు. సమావేశంలో అనిల్‌రెడ్డి, మహ్మద్ ఇర్షాద్, మహ్మద్ షకీల్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు



నర్వలో పల్లకీసేవ చేపట్టిన భక్తులు

నారాయణపేట రూరల్: జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాలలో సోమవారం అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర సరిహద్దులోని కాలబెలగుంది క్షేత్రంలో స్వామివారికి సుప్రభాతం, రుద్రాభిషేకం, బిల్వార్చన, అష్టోత్తర నామావళి, అభిషేకం, అలంకరణ, హారతి చేపట్టారు. పట్టణంలోని అయ్యప్పస్వామి, సింగార్‌బేస్ శివలింగేశ్వర స్వామి దేవాలయం, మహంకాళివీధి శివాలయం, తాయమ్మగుడితో పాటు మండలంలోని ఎక్లాస్‌పూర్ తిమ్మప్ప ఆలయం, జిలాల్‌పూర్ కర్రెప్పతాత గుడిలో పూజలు చేసి భక్తులకు అన్నదానం చేపట్టారు.

మక్తల్: పట్టణంలోని ఉమామహేశ్వరాలయంలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారికి తెల్లవారుజామున అభిషేకం, మంగళ హారుతులు చేపట్టారు.

నర్వ: మండల కేంద్రంలో సోమవారం అమావాస్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక శివాలయంలో పంచామృతాభిషేకం, బిల్వార్చన, లింగాష్టకం చేపట్టారు. మధ్యాహ్నం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారి పల్లకీని గ్రామ పురవీధుల గుండా భజనా మండలి సభ్యులు ఊరేగింపు చేపట్టారు. రాత్రికి భజనా మండలిచే అఖండ భజనా చేపట్టారు.

ఘనంగా బచ్చల మారెమ్మ జల్దిబిందె

మాగనూర్: మహాశివరాత్రిని పురస్కరించుకుని మండల కేంద్రంలో వెలసిన శ్రీశ్రీ బచ్చల మారెమ్మవ్వ జల్దిబిందె కార్యక్రమాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. సోమవారం మండల కేంద్రం నుంచి అమ్మవారి విగ్రహానికి ఊరేగింపుగా కృష్ణా మండలంలోని కృష్ణానదికి వెళ్లి నది జలాలతో అమ్మవారి విగ్రహాన్ని అభిషేకించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బాజాభజంత్రీల నడుమ గ్రామానికి చేరుకుని సాయంత్రం అమ్మవారి ఉత్సవాలను చేశారు.



కృష్ణనది వద్ద అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



జిల్లా కేంద్రంలో శివలింగేశ్వర ఆలయంలో స్వామివారి ప్రత్యేక అలంకరణ